# జెరూసలెమ్

లోకంలో ఆడామగాభేదం పాటించ నటువంటిదీ, కలిమిలేముల వ్యత్యాసం పరిగణించనటువంటిదీ, తెల్లనా నల్లనా కేటాయింపు నెఱుగనటు వంటిదీ ఏదైనా వుందా యంటే అది డీసెల్‌కారు. దానిలో స్త్రీలకు ప్రత్యేకించి యరలేదు. ఒకటి, రెండు, ఇంటర్లులేవు. అమెరికన్‌కూ ఒకలాంటి సీటే, ఆది ఆంధ్రుడికీ ఒకలాంటి సీటే అందఱూ ఒకే గుమ్మంగుండా, ధాన్యం కొట్టో పొయ్యబడ్డట్టుగా త్రొయ్యబడి త్రోసుకుంటూనో కాసుకొంటూనో నించోవలసిందే.

"మఱి బండిలేదు ఇది తపితే! ఆలా ఎకూ! ఎకు!" యంటూ మిషనరీదేవిడ్ మిసెస్ దేవిడ్‌ను ప్రోత్సహిస్తూ మాస్టర్ దేవిడ్‌ను కిటికీగుండా లోపలున్న హిందువులకు యందిస్తూన్నాడు. మాస్టర్ దేవిడ్ నవ్వుతున్నాడు తనను పైకెత్తి కిటికీలోంచి లోపలకు దించుతూవుంటే; ఎవరో లోపల్నుంచి "గుడ్‌మార్నింగు సర్!" యని అందుకున్నాడు. ఓ! మీ రకడున్నారు? లేకుంటే దురదృష్టవంతులిమి." అంటూ పెద్దదేవిడ్ భార్యా సమేతంగా ఏలాగో వోలాగు ఎట్టకేలకు లోపలకు ఎక్కగలిగాడు.—"బయట ప్లాట్‌ఫారముమీద నాకెంత మంది యనుచరులువుంటే ఏంలాభం? లోపల్నుంచి నాబిడ్డణ్ణి యందుకోడానికి లాతిమతస్థుల తోడ్పాటే కావలసివచ్చిందికదా" అన్నసంగతి గ్రహిస్తూ ఆవఱకే జనంతో నిండియున్న ఓబల్ల చివర్ని తాను కూర్చుని ఎదరబల్లమీద తన భార్యను "ఆసీను రాలువుగా" అన్నట్టు చెయ్యివూపి బండి కదలడంలో ఊపిరి బాగా పీల్చుకుంటూ చిన్న దేవిడ్‌ను తన కాళ్ళమధ్యకు తీసుకొని

నిలుపుకొన్నాడు నిలుపుకొని ప్లాట్‌ఫారమ్‌మీది తన యను చరులతో "ఇప్పటికి వెళుతూయున్నాము. మళ్ళీ కొద్ది రోజులలో మనము కలుసుకోగలము" అని దోసిటగుండా యఱచాడు, అమెరిక నాంధ్రోచ్చారణ ప్రచురిస్తూ. దంపతులు తమతమ టోపీలను పైని ఖాళీగాయున్న చిట్టి యటకమీద పడేశారు.

ఉచ్ఛారణ ఏలావున్నా బాగా తెనుగుతెలిసిన వారేను ఆ దొర దొరసాని యని బండిలో వాళ్ళందఱూ వెంటనే గ్రహించారు. విడ్డూరంగా చూడసాగేరు. చిన్న డేవిడ్ కూడా తెనుగు తనకూ వచ్చునని చూపించేలాగు పపా! కొంగ! మమా! ఆవు!" అంటూ రైలు రోడ్డు కాపక్కా ఈ పక్కా కనిపించే పక్షినో జంతువునో కాపరుస్తూ ఆంధ్రాన్ని ఆనవాలు బట్టేడు. బండి నాలుగుమూలలా పూరా పరిశీలించగలిగింది ఆ చిన్నబిడ్డ ఒక్కడే. అతడు తేరిపారనేరని ముఖం లేదు, ముక్కులేదు, కన్నులేదు, కాలులేదు. ఎందాకా? ఒకానొక వ్యక్తిని "వాడుగో లాజరస్! వాడుగో! లాజరస్" అనేదాకా!

పెద్దడేవిడ్ వెంటనే లాజరస్ యనే ఆ అవతల వ్యక్తిని గుర్తించాడు. "నీవూ మాతోటిపాటు బండిలో ఎకగలిగావు? మాతో వస్తున్నావు లాజరస్!" అని ప్రయాణీకుల పదిపదేను తలకాయల మీదనుంచి షైర్‌లెస్ పోనిచ్చాడు. లాజరస్ "చిత్తం! సార్! చిత్తం!" అనుకుంటూ దొరగారివంకకు గుంపుగుండా చేతుల్తో దారి త్రవ్వుకుంటూ చేరుకున్నాడు. దొరగారు లాజరస్‌ను వీపుమీద తట్టుతూ "మన కన్వెన్షన్‌లో నీవు బాగా మాట్లాడావు! నీ ఉపన్యాసం బాగుంది!" అన్నారు. దొరసానమ్మగారు లాజరస్‌తో "బాగా మాట్లాడారు మీరు!"

అంది. "ఇదంతా తమరు చెప్పించిన విద్దేనండి" అన్నాడు లాజరస్.

దొరగారు "లాజరస్! రష్-జనసమ్మర్దం బండిలో దళంగావుంది. దిగడంలో చిక్కులేకుండా దింపు మమ్మల్ని" అన్నారు. మాస్టర్ డేవిడ్ వెంటనే "నన్ను లాజరస్ దింప వద్దు. నన్ను ఆయన దింపుతారు నన్నెక్కించిన కిటికీగుండా దింపుతారు" అని ఒకానొక హిందువుణ్ణి యదివఱకు తన్నందు కుని కుశలపఱచిన యతణ్ణి చూపించబోయాడు. ఆ ఒకానొక వ్యక్తి యప్పటికప్పుడే ఎదో క్రితం హాల్టింగువద్ద దిగిపోయేడు. మాస్టర్ డేవిడ్ బిక్కమొగంతో కిటికీ యవతలకు ఊరికే చూడ దొడగేడు తన రెండుకళ్ళూ చెమ్మగిలజేసికొంటూ.

లాజరస్ "మాస్టర్ డేవిడ్‌ను ఎత్తుకుని ఆ కిటికీ యవత లకు చూడ్డంగాదు బిడ్డా! ఈ కిటికీ యవతలకు చూడు" అని జవాబు కిటికీవద్దకు కొంపోతూ "నిన్నిలా ఈ కిటికీలోంచి దింపి విడిచిపెడితే ఎక్కడికి వెడతావో తెలుసునా? మా పల్లెటూరు చేరుకుంటావు! మా వూరికి యడ్డదారి యదేను. అవిగో! యవే మా పొలాలు! ఆ వరిచేనుకోత నేను కోయిస్తూ ఉన్నదే ఆపమను డ్రైవర్ను గాడీ ఆపమను! ఆపు! అపు! ఆపు!" యని అన్నాడు ఏవేవో కనబరుస్తూ. ఆ కుఱ్ఱవాని ముఖమే కాకుండా బండిలో వారి యందఱి ముఖాలూ ఆ వెంపుకు తిరిగాయి. లాజరస్ ఇంకా ఉత్సాహంతో "అదే నా యిల్లు! యదే నా పూరిల్లు. పూరిల్లయినా చూడు ఇక్కడకు స్కాయి స్క్రేపర్‌లా దిఙ్మండలం యంటివున్న చూపుతో మెఱసిపోతూ వుంది. కనిపించడంలేదు తండ్రీ! మా ఆసప్పాదు, చిక్కడు

పాదు ? నాయింటికి ఎప్పుడువస్తావు నీవు ! ఎప్పుడు వస్తారు మీ పపా ; మీ మమా ! ఎందుకు వస్తారు ?'' అని నిరాశా విహ్వాలుడై డేవిడ్ కిశోరుని చిబుకం ముద్దెట్టుకున్నాడు.

" అయితే యదేనా మీవూరికి దారి ?" అన్నాడు మిస్టర్ డేవిడ్ లాజరస్‌తో. " చిత్తం! రైలుగట్టునుంచి యడ్డదారి—తమరోతూరి దయచెయ్యాలి '' అన్నాడు లాజరస్. " అయితే మీరు పై స్టేషనులో దిగుతారు " యంది దొరసానమ్మగారు. " అవును తల్లీ ! దిగి వెనక్కువస్తాం ! యడిగో స్టేషన్ '' యంటూ మాస్టర్ డేవిడ్‌ను ఆమెకు అందిచ్చాడు.

మాస్టర్ డేవిడ్ కొంచెం మొగంవంచుకు కించబడ్డాడు. లాజరస్ " సెలవు '' యభినయిస్తూవుంటే దొరసానమ్మగారు కొడుకును చేరదీసుకొంటూ " గుడ్‌బై లాజరస్ '' అంది. అని పిల్లవానితో " మనం రేపు అమెరికా వెడతాం ! నేడు లాజరస్ వాళ్ళవూరు వెడుతూ ఉన్నట్టే మనం రేపు అమెరికా వెడతాం ! నీవు ఏడవకూడదు. "నానీ'' డియర్ అంది.

మాస్టర్ డేవిడ్ " అడ్డదారిని వెళ్ళాలి !'' అన్నాడు. అలా లాజరస్ చూపిన దారివంక జూస్తూ. ఆ కుఱ్ఱవాని చూపు కనిపెట్టకుండానే మిస్టర్ డేవిడ్ యడ్డదారినే జెరూసలమ్‌గుండా!" అని పంట్లం జేబులోంచి బైబిలు చిన్నిపొత్తం చూస్తూ పెలస్టయిన్ పటంవున్న పుట తెఱిచాడు. ఆ పుటలోంచి ఒక రూపాయి నోటు ఇవతలకు పడింది.

లాజరస్ యప్పుడే గాడీదిగి వెనక్కు రైలుగట్టే యరవై గజాలు నడచి యడ్డదారి పుచ్చుకు విస్పష్టంగా గోచరిస్తున్నాడు తుమ్మల్లో పొద్దు కూకిస్తూ. మాస్టర్ డేవిడ్ " మామా ;

లాజరస్ ఊరుపేరు ?" అన్నాడు. మిస్టర్ డేవిడ్ రూపాయి నోటు తిరిగి బైబిలు పటపు పుటలో సర్దుతూ " ఈ రూపాయి నోటు క్రింద వుంది లాజరస్ వూరుపేరు, చదువు " అన్నాడు. పిల్లవాడు రూపాయినోటు తాను తీసికొంటూ పాలెస్టయిన్ పటం చూస్తూ " జెరూసలెమ్ " అని చదివాడు.

మిసెస్ డేవిడ్ చిరునవ్వు నవ్వింది. మిస్టర్ డేవిడ్ " వచ్చాం " అని తనటోపీ ధరించుకుంటూ భార్యాటోపీకూడా తానే తీస్ ఆమె నెత్తిమీద వుంచాడు.

మిసెస్ డేవిడ్ "క్యూ" అంది. మిస్టర్ డేవిడ్ రూపాయి నోటు ఆమె కళ్ళమీద వుంచి " జెరూసలెమ్ " అన్నాడు. మిసెస్ డేవిడ్ " ఐ ? మై ఐ ? క్యూ " అంది.

.... .... .... .... ....

# మా కెప్పుడూ స్వరాజ్యమే

నదికి వఱద కొత్తగా వచ్చింది. అద్దరినీ ఇద్దరినీ కూడా నవ్యత హెచ్చింది. గట్టనే పచ్చని పచ్చిక మొలిచింది. వాలునే కంప, "క్ర్ర" తొడుసు చొప్ప కొట్టుకొనివచ్చి యదోమాదిరి అంచు కట్టులా యమరివుంది. గోధుంవన్నె త్రాచులా యతిరాజసంగా నడుస్తూవుంది నీరు. ఆ నదిమీద పడవే దిగాడో అర్ధరాత్రి, లేక అమరనదీలోయం నుండి ఊడిపడ్డాడో, తెల్లవారేసరికి ఒక కోయపురుషుడు ఒడ్డునే కనబడసాగాడు. తనదే ఆ ప్రవాహం యన్నట్టు తనివిదీఱ స్నానంచేసి, ఒక నల్లనికంబళిగుడ్డ పుట్ట